సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం । 30 । మే । 2024



నేటి నుంచి ఉర్సు

అలంపూర్‌లో షా–అలీ–పహిల్వాన్ ఉర్సు గురువారం నుంచి ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▸



ఉల్లి దిగుమతి

దేవరకద్రకు వ్యాపారులు ఇతర మార్కెట్ల నుంచి ఉల్లిని తీసుకువచ్చి విక్రయించారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /24.1

వాతావరణం

రోజులో ఎక్కువ భాగం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి టౌన్: జిల్లాలోని ఎస్సీ **గురుకులాల్లో** ఇంటర్ ప్రథమ సంవత్సరంలో **మిగిలిన సీట్ల** భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు **జిల్లా** గురుకులాల అధికారి దానం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 9 కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ, సీజీటీ కోర్సులలో సీట్లు ఉన్నాయన్నారు. 2023– 24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు www.tswreis.ac.in వెబ్‌సైట్‌లో రూ.100 రుసుంతో శుక్రవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సమీపంలోని ఎస్సీ గురుకుల కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట

నాగర్‌కర్నూల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించడం, విద్యార్థుల నమోదు పెంచడానికి రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల పరిధిలో వచ్చే నెల 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3 నుంచి 19 వరకు ప్రతిరోజు ఉదయం 7 నుంచి 11 గంటల వర కు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపడతామన్నారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని, ఈ సందర్భంగా పండుగ వాతావరణంలో బడులను తెరవాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ బడిపై వారి కి భరోసా కల్పించాలన్నారు. బడిబాటలో భాగంగా పంచాయతీరాజ్, మున్సిపల్, డీఆర్‌డీఓ, లేబర్, వైద్య, ఆరోగ్య, అన్ని సంక్షేమ శాఖ లు, మహిళా సమైక్య సంఘాలతో సమన్వయం చేసుకుంటూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, స్వయం సహాయక బృందాలతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు భారీగా చేరేలా ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య, పాఠశాల విద్యార్థుల గత విజయాలను వివరించి పిల్లలను ఆకట్టుకునే ప్రయత్నం చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేకంగా మాట్లాడి పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాలని చెప్పారు. గ్రామస్థాయిలో అందరినీ బడిబాటలో భాగస్వామ్యం చేయాలన్నారు.

మొక్కజొన్న క్వింటా రూ.2,342

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,342, కనిష్ఠంగా రూ.1,910 ధరలు లభించాయి. అలాగే జొన్నలు గరిష్ఠంగా రూ.4,317, కనిష్ఠంగా రూ.2,177, ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్ఠంగా రూ.2,579, కనిష్ఠంగా రూ.1,901, హంస గరిష్ఠంగా రూ.1,821, కనిష్ఠంగా రూ.1,809 ధరలు పలికాయి.

కౌంట్‌డౌన్..

జూన్ 2న ఎమ్మెల్సీ ఉపఎన్నికల ఓట్ల లెక్కింపు



- 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నం
- సీఎం ఇలాకాలో ఓటరు తీర్పుపై ఉత్కంఠ
- ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఎన్నికల ఫలితాలను వెల్లడించేందుకు ఇంకా ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. జూన్ 4న ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాలకు ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం కౌంటింగ్‌ను మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ పరీక్షల విభాగంలో, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని నెల్లికొండ సమీపంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టనున్నారు. జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అలాగే మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక మార్చి నెల 28న నిర్వహించగా, ఓట్ల లెక్కింపును జూన్ 2న చేపట్టనున్నారు. దీంతో లోక్‌సభ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం..

ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో నిర్వహించిన ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కోసం పకడ్బందీగా ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. సీసీ కెమెరాలు, కేంద్ర బలగాలు, పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తు నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు.

మూడు రోజుల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఫలితాలు..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి మార్చి 28న ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ స్థానంలో కాంగ్రెస్ తరఫున పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ నవీన్‌కుమార్ రెడ్డి బరిలో ఉండగా, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ పోటీ చేశారు. మొత్తం 1,439 మంది ఓటర్లకుగానూ ఈ ఉప ఎన్నికలో 1,437 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, ఇద్దరు ఎంపీటీసీలు ఓటువేయలేదు. ఈ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపును జూన్ 2న చేపట్టి, అదే రోజున ఫలితాలను ప్రకటించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. అభ్యర్థులకు వచ్చిన ప్రాధాన్యత ఓట్ల ప్రకారం ఓట్ల లెక్కింపు చేపడతారు. మొత్తం చెల్లుబాటు అయిన ఓట్ల ఆధారంగా గెలుపు కోసం అవసరమైన కోటాను అధికారులు నిర్ధారిస్తారు. కోటాకు సరిపడు ఓట్లు వచ్చే వరకు అభ్యర్థుల మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో బరిలో ఉన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎవరికి వారు తమ గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఫలితాల్లో వీరిలో ఎవరికి అదృష్టం వరిస్తుందోనన్నది ఆసక్తికరంగా మారింది.

జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అదే రోజున ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నారు. ఇప్పటికే కౌంటింగ్‌లో నిమగ్నమయ్యే ఎన్నికల సిబ్బందికి శిక్షణ సైతం పూర్తిచేశారు.

ఫలితాలపై అభ్యర్థుల్లో హైటెన్షన్..

లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో హైటెన్షన్ నెలకొంది. ఇప్పటికే పోలింగ్ నాటి నుంచి ఇప్పటివరకు బూత్ స్థాయి, మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తమకు వచ్చిన ఓట్ల శాతాన్ని అంచనా వేసుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు జూన్ 4న ఎన్నికల ఫలితాలపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. మే 13న ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలకు ఎన్నిక నిర్వహించగా, సుమారు పక్షం రోజులుగా అభ్యర్థులు తమ పార్టీ ముఖ్య నేతలతో నియోజకవర్గాల వారీగా ఎన్నికల తీరుపై సమీక్షల్లో నిమగ్నమయ్యారు. మీడియా, సర్వే సంస్థలు, ఇతర వర్గాల ద్వారా ఓటరు నాడిని అంచనా వేసేందుకు ప్రయత్నాలు సాగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో రెండు పార్లమెంట్ స్థానాలను సొంతం చేసుకుంటామని కాంగ్రెస్ ధీమాను ప్రదర్శిస్తోంది. కాంగ్రెస్ పాలన మొదలైన ఆరు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, ప్రజలు తమ వైపే చూస్తున్నారని బీఆర్‌ఎస్ తమ అభ్యర్థుల గెలుపుపై ఆశలు పెట్టుకుంది. ఈ సారి ఎన్నికల్లో భారీస్థాయిలో క్రాస్ ఓటింగ్ జరిగిందని, నిశ్శబ్దమైన ఓటింగ్‌తో తమ అభ్యర్థులు గెలవబోతున్నారని బీజేపీ జోస్యం చెబుతోంది. ఎన్నికల ఫలితాలకు కేవలం ఐదు రోజుల సమయం మిగిలి ఉండటం, ఫలితాల్లో ప్రజలు ఏ పార్టీకి మద్దతు కట్టబెట్టారన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

అధ్యక్ష పీఠం ఎవరికో..?

కొల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ



- కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయి మెజారిటీ
- అధిక సంఖ్యలో ఆశావహులు
- కులాల వారీగా కౌన్సిలర్ల ప్రయత్నాలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్ణయమే ఫైనల్

కొల్లాపూర్: స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. శుక్రవారం చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉండటంతో ఆ పార్టీలో ఆశావహుల సంఖ్య పెరిగింది. బీసీ మహిళకు రిజర్వ్ అయిన ఈ పదవి కోసం కౌన్సిలర్లు కులాల వారీగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా.. నమ్మకస్తులు, పార్టీకి దన్నుగా నిలిచే వారికి ప్రాధాన్యం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీకి 15 మంది..

మున్సిపల్ ఎన్నికల్లో జూపల్లి కృష్ణారావు వర్గీయులు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున బరిలో నిలిచారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పట్టణంలోని 20 వార్డుల్లో పోటీ చేశారు. ఎన్నికల్లో జూపల్లి వర్గీయులు 11 స్థానాల్లో, బీఆర్‌ఎస్ అభ్యర్థులు 9 స్థానాల్లో విజయం సాధించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖాతా తెరవలేదు. అయితే ఎక్స్ అఫీషియో ఓట్లతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన విజయలక్ష్మి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, మహిమూదాబేగం వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. తర్వాతి కాలంలో జూపల్లి వర్గానికి చెందిన ఒకటో వార్డు కౌన్సిలర్ అనిత, 11వ వార్డు కౌన్సిలర్ కరుణ బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో జూపల్లి వర్గీయుల సంఖ్య 9కి తగ్గిపోయింది. ఆ తర్వాత జూపల్లితోపాటు ఆయన వర్గీయులంతా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలోనే గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, 7వ వార్డు కౌన్సిలర్ రాముడు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు అలివేల, చిట్టెమ్మ, హైమావతి, కరుణ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల సంఖ్య 15కు చేరుకుంది.

మార్చి నెలలో అవిశ్వాసం

మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు 2/3 వంతు మెజార్టీ ఉండటంతో ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మార్చి 21న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిపై అవిశ్వాసం ప్రకటించారు. ఏప్రిల్ 16న నిర్వహించిన అవిశ్వాస పరీక్ష నెగ్గడంతో విజయలక్ష్మి పదవి నుంచి దిగిపోయారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నూతన చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నెల 25న ఎన్నికల కమిషన్ చైర్‌పర్సన్ ఎన్నికకు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 మంది కౌన్సిలర్లకు, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 5 మంది కౌన్సిలర్లకు మున్సిపల్ అధికారులు సమాచారం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆర్డీఓ సమక్షంలో చైర్‌పర్సన్ ఎన్నిక జరగనుంది.

ఆశావహులు.. ఐదుగురు

బీసీ మహిళకు రిజర్వ్ అయిన మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానానికి కాంగ్రెస్ కౌన్సిలర్లు పోటీ పడుతున్నారు. మున్సిపాలిటీలో 12 మంది మహిళా కౌన్సిలర్లు ఉండగా.. 10 మంది కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. వీరిలో 8 మంది బీసీ మహిళలు ఉన్నారు. చైర్‌పర్సన్ పదవిని గతంలో కొల్లాపూర్ సర్పంచ్‌గా పనిచేసిన 19వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి, 6వ వార్డు కౌన్సిలర్ రమ్యకుమారి, ఒకటో వార్డు కౌన్సిలర్ జ్యోతి, 8వ వార్డు కౌన్సిలర్ శ్రీలక్ష్మి, 13వ వార్డు కౌన్సిలర్ శిరీష ఆశిస్తున్నారు. అయితే వీరిలో రమ్యకుమారి పేరు ఫైనల్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ఈమె ఎంపికపైనే సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే చైర్‌పర్సన్ పదవి కోసం పోటీపడుతున్న ఆశావహులంతా మంత్రి జూపల్లి నిర్ణయమే తమకు శిరోధార్యమని పేర్కొంటున్నారు.

ఏకగ్రీవం అయ్యే అవకాశం

చైర్‌పర్సన్ పేరును ముందుగా కాకుండా ఎన్నిక రోజు సీల్డ్ కవర్ ద్వారా మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. ఇదే జరిగితే చైర్‌పర్సన్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ మేరకు ఆశావహులతో ఇప్పటికే మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. అనుభవం, విధేయత, స్థానిక రాజకీయ అంశాలతోపాటు నమ్మకంగా ఉండే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ పదవికి పోటీ ఉంటే ఓటింగ్‌కు హాజరుకావాలని, ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంటే గైర్హాజరు కావాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు భావిస్తున్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి



తూడుకుర్తి పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ తదితరులు

నాగర్‌కర్నూల్/ బిజినేపల్లి: పాఠశాలలకు కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని తూడుకుర్తిలోని జెడ్పీహెచ్‌ఎస్, సీపీఎస్, పీఎస్‌హెచ్‌సీ, పీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీరాజ్ ఇంజినీర్లతో మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, బ్లాక్ బోర్డులు తదితరవి సమకూర్చాలన్నారు. అలాగే బిజినేపల్లి మండల సమాఖ్యలో యూనిఫాంల స్టిచింగ్‌ను పరిశీలించారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరికీ దుస్తులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఇక్కడ 5,411 యూనిఫాంలకు గాను 2 వేలు సిద్ధం చేసినట్లు ఏపీఎం రజిత వివరించారు. మిగిలిన దుస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి పాఠశాలలు తెరిచే నాటిని అందించాలని, నాణ్యతగా కుట్టాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓలు శ్రీనివాసులు, కథలప్ప, పీఆర్‌ఏఈ సంపత్‌కుమార్, ఏపీఓ రజిత, హెచ్‌ఎంలు రమేష్, వకుళ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లుశెట్టి, తూడుకుర్తి పంచాయతీ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

పంట బీమాపై ఆశలు

ప్రీమియం చెల్లించనున్న ప్రభుత్వం

- కసరత్తు చేస్తున్న వ్యవసాయశాఖ
- వానాకాలం నుంచే ఉచిత పంటల బీమా

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వచ్చే వానాకాలం సీజన్‌లో అమలు చేయనున్న పంటల బీమా పథకంపై వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరడం, ప్రీమియం చెల్లింపు, బీమా పరిహారం తదితర వాటితో పాటు పొరుగు రాష్ట్రాల్లో పంటల బీమా పథకం ఎలా అమలవుతున్నాయనే దానిపై అధ్యయనం చేస్తున్నారు. గతంలో అమలు చేసిన పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95 శాతం ప్రీమియాన్ని, మిగిలిన 5 శాతం ప్రీమియాన్ని రైతులు చెల్లించేవారు. పరిహారం పొందడంలో సమస్యలు ఉండటం, పెద్దగా రైతులకు ఉపయోగం ఉండటం లేదనే కారణంతో గత ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేయలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించాలనే నిర్ణయానికి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 11.35 లక్షల మంది రైతులు పంటలను సాగు చేస్తున్నారు. వరి ప్రధాన పంటగా, ఆ తర్వాత పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. ఇతర పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. ప్రతి సంవత్సరం ఏదో రకంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం పంట బీమాపథకం అమలు చేస్తుంది. గతంలో బ్యాంకు నుంచి రుణం పొందే రైతులకు పంట బీమా తప్పనిసరి చేశారు. రుణంతో సంబంధం లేకుండా పంటలను సాగు చేసే రైతులు మాత్రం బీమా చేయడమనేది వారి ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. తర్వాత ప్రీమియం చెల్లింపు అనేది రైతుల ఇష్టానికి వదిలేశారు. పత్తికి వాతావరణ ఆధారిత గ్రామం యూనిట్‌గా, ఇతర పంటలకు మండల యూనిట్‌గా బీమా పథకాన్ని అమలు చేశారు. తాజాగా ఏఏ పంటలకు బీమా వర్తింపజేస్తారు, ప్రీమియం, పరిహారం, బీమా ఎలా అమలు అనేది తేల్చాల్సి ఉంది. వీటికి సంబంధించి వ్యవసాయశాఖ అధ్యయనం చేస్తుంది.



జిల్లాల వారీగా పంటల సాగు.. రైతుల వివరాలు

జిల్లా	రైతులు	సాగు భూమి
మహబూబ్‌నగర్	2,39,600	3,21,523
నాగర్‌కర్నూల్	3,50,699	5,38,531
వనపర్తి	1,82,901	2,54,012
జోగుళాంబ గద్వాల	1,76,402	5,35,435
నారాయణపేట	1,85,878	4,62,476

రైతులకు ప్రయోజనం



ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు బీమా పథకం ఎంతో ఉపయోగపడుతుంది. వానాకాలం పంటల నుంచి రైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. యూనివర్సల్ కవరేజ్, ఎంపిక చేసిన ప్రాంతాల్లోని పంటలకు బీమా పథకం వర్తింపజేయడం, రైతులకు ఉచిత ప్రీమియం, వాటాను ప్రభుత్వం భరిస్తుంది. బీమా యోజన ప్రయోజనాలు రైతులు పొందేలా ఏఈఓలు రైతులకు అవగాహన కల్పిస్తారు.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మహబూబ్‌నగర్

పక్కాగా అమలు..

కొత్తగా అమలు చేయనున్న పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇందుకు ఇప్పటికే క్లస్టర్ల వారీగా వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్‌ను పరిగణలోకి తీసుకోనున్నారు. చాలా మంది ఏఈఓలు పంట పొలాలకు వెళ్లకుండా, రైతులను అడిగి రాస్తుండటం, పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో పంటల నమోదుపై గొడవలు జరుగుతుండటంతో పంటల బీమాను పకడ్బందీగా అమలు చేయాలంటే బయోమెట్రిక్ తీసుకోవడంతో పాటు రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతుండటంతో పంటల బీమా పథకాన్ని త్వరగా తేల్చాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లాల వారీగా పంటల సాగు అంచనాలు, ప్రీమియం తదితర వాటికి సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని కోరారు. పంటల బీమాకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించడం, బీమా కంపెనీలను సంప్రదించడం, ప్రీమియాన్ని నిర్ధారించడం, ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనతో వచ్చే ప్రయోజనాలను వినియోగించుకోవడంతో పాటు రైతులపై ఎలాంటి భారం పడకుండా పంటల పథకాన్ని అమలు చేయనుంది.

జీవాలకు టీకాలు వేయించుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొలకెత్తుతున్న పచ్చిగడ్డి తిని గొర్రెలు రోగాలబారిన పడకుండా ముందు జాగ్రత్తగా గడ్డి టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని దేశిటిక్యాల పశువైద్య సబ్‌సెంటర్‌లో నిర్వహించిన గడ్డి టీకా క్యాంపును సందర్శించి మాట్లాడారు. అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడుతూ పశువులతోపాటు గొర్రెలు కూడా రోగాల బారిన పడకుండా గడ్డి రోగం టీకాలు చేయించాలని చెప్పారు. అనంతరం మందుల ఎంక్స్పైరీ తేదీలను, కంటైనర్, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పశువైద్య అసిస్టెంట్ శ్రావణి తదితరులున్నారు.

సజావుగా ఎమ్మెల్సీ ఉపఎన్నిక కౌంటింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్‌ను నిష్పక్షపాతంగా, సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సూపర్‌వైజర్లు, సహాయకులకు ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమం ప్రకారం ఓటర్లు ఓటు వేస్తారని, కౌంటింగ్‌లో భాగంగా జూన్ 2న మొదట ప్రారంభ లెక్కింపు చేపడతామన్నారు. ఇందుకోసం ఐదు టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభం లెక్కింపులో మొత్తం పది పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓటర్లను లెక్కిస్తారన్నారు. ఇందులో చెల్లిన, చెల్లని ఓట్ల వర్గీకరణలో సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఆ ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కిస్తామన్నారు. ఆ తర్వాత చెల్లుబాటు అయిన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావాల్సిన కోటాను నిర్ధారిస్తామన్నారు. ఎవరైనా అభ్యర్థి కోటాకు సరిపడా ఓట్లను సాధించిన వ్యక్తిని గెలుపొందినట్లుగా ప్రకటిస్తామన్నారు. ఏ అభ్యర్థికీ కోటాకు కావాల్సిన ఓట్లు రాకుంటే తదుపరి ప్రక్రియను చేపట్టి ప్రాధాన్యత క్రమం ఆధారంగా ఓట్లు లెక్కిస్తామన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, నారాయణపేట రెవెన్యూ అడిషనల్ కలెక్టర్లు ఎస్.మోహన్‌రావు, మాయాంక్ మిట్టల్, షాద్‌నగర్, మహబూబ్‌నగర్ ఆర్డీఓలు వెంకటమాధవరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో రైతులు సాగు చేసుకునే వివిధ రకాల పంటలకు కావాల్సిన విత్తన నిల్వలు వ్యవసాయ శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన నిల్వల వివరాలను ఒక ప్రకటనలో విడుదల చేశారు. 505.8 క్వింటాళ్ల వరి విత్తనాలు, 67 క్వింటాళ్ల మొక్కజొన్న, 6.10 క్వింటాళ్ల కంది, 2,42,669 పాకెట్ల పత్తి, 2 క్వింటాళ్ల జొన్న విత్తనాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని 43 విత్తన కేంద్రాల ద్వారా 60 శాతం సబ్సిడీతో 670 క్వింటాళ్ల జనుము విత్తనాలకు గాను 373.5 క్వింటాళ్లు, 250 క్వింటాళ్ల జీలుగ విత్తనాలకు గాను 215.6 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే 700 క్వింటాళ్ల జీలుగ, 250 క్వింటాళ్ల జనుము విత్తనాలను అదనంగా తెప్పించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా 17,320 మెట్రిక్ టన్నుల యూరియా, 1,994 మె.ట., డీఏపీ, 228 మె.ట., పొటాష్, 3,622 మె.ట., ఊపర్ పాస్ఫేట్, 5,580 మె.ట., మిశ్రమ ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. వానాకాలంలో అన్ని ఎరువులు కలిపి 57,883 మె.ట., ఎరువులు వినియోగించడం జరిగిందని వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

క్లుప్తంగా

రెండు గ్రామాల్లో విషాదఛాయలు

● కన్నీటిమధ్య ముగ్గురు యువకుల అంత్యక్రియలు పూర్తి

మక్తల్: బైక్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందగా, బుధవారం రెండు గ్రామాల్లో కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. మక్తల్ చెందిన రాఘవేంద్రచారి, మున్నూర్ వెంకటేష్ అంత్యక్రియలు పట్టణ సమీపంలో ఉన్న శ్మశానవాటిలో నిర్వహించారు. మండలంలోని పంచలింగాలకు చెందిన మహేష్‌కుమార్ అంత్యక్రియలు గ్రామంలో నిర్వహించారు. చిన్న వయసులో మృతి చెందడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు. పలువురు నేతలు కుటుంబసభ్యులను పరామర్శించారు.

వివాహితకు ప్రేమపేరుతో వేధింపులు

● ఉరేసుకుని ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: వివాహితను ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేయడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ ఎస్ఐ విజయ్ భాస్కర్ తెలిపిన వివరాలు ఇలా.. నారాయణపేటకు చెందిన దోరేపల్లి పూజకు మద్దూర్‌కు చెందిన దోరపల్లి అంజిలయ్యకు 2011లో వివాహమైంది. వీరికి ఐదేళ్ల కూతురు, 11నెలల కుమారుడు ఉన్నారు. 9ఏళ్ల నుంచి పట్టణంలోని మోనప్పగుట్టలో అద్దె ఇంట్లో ఉంటూ భర్త మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల దోరేపల్లి పూజ నారాయణపేటలోని తల్లి ఇంటికి వెళ్లి అక్కడే వారం రోజులు ఉంది. ఆ సమయంలో పూజ భయంతో ఎవరితో ఫోన్‌లో మాట్లాడుతున్న విషయాన్ని తల్లి గమనించి విచారించగా డి.రాజు అనే వ్యక్తి తనను ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడని, భర్త, పిల్లలను వదిలేసి తన వెంటా రావాలని ఒత్తిడి చేస్తున్నాడని తల్లికి చెప్పింది. దీనిపై మహబూబ్‌నగర్‌కు వచ్చి మాట్లాడుతాం అని కూతురు పూజను తల్లి మంగళవారం ఉదయం 8గంటలకు మోనప్పగుట్టలో ఉండే భర్తకు వద్దకు పంపించింది. అయితే రాత్రికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రేమ పేరుతో మానసిక వేదనకు గురి చేసి ఆత్మహత్యకు కారకుడైన రాజుపై చర్యలు తీసుకోవాలని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య


కృష్ణమ్మ (ఫైల్)

తెలకపల్లి: ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కార్వంగకు చెందిన చింత కృష్ణమ్మ(33) ఈ నెల 28న భర్త చింత స్వామితో గొడవపడి పురుగు మందు తాగింది. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి గాజుల బాలకిష్టమ్మ ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం

నవాబుపేట: అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని నీర్‌సాబ్‌తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మండలంలోని నీర్‌సాబ్‌తండాకు చెందిన కాట్రావత్ రవి(37) ఇంటి పక్క గల బాత్‌రూంలో చీరతో ఉరేసుకున్నాడు. కాగా ఉరి వేసుకున్న సమయంలో అతడి బరువుకు బాత్‌రూం కట్టె విరగటంతో అతడు కిందపడిపోగా శబ్దానికి చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. భార్య నీలమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. రవి కొత్తగా ఇంటి నిర్మాణం చేస్తున్న తరుణంలో అప్పులు చేసినట్లు దానికి గాను భూమిని అమ్మాలని చూడగా కుటుంబ సభ్యులు అంగీకరంచలేదు. దీంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు వివరించింది.

తలకు గాయంతో మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: కళ్లు తిరిగి కిందపడిన ఓ మహిళకు తలకు తీవ్రగాయమై మృతి చెందింది. టూటౌన్ ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో హబీబ్‌నగర్ చెందిన మక్బూల్ అహ్మద్ చాంద్ అతని భార్య హఫీజా బేగం(57)తో కలిసి మంగళవారం సాయంత్రం సద్దలగుండు వైపు వెళ్తుంటే డీఈవో కార్యాలయం వద్ద కళ్లు తిరుగుతున్నాయని బైక్ దిగిన తర్వాత రోడ్డుపై పడిపోయింది. ఆమె తల వెనుక భాగంలో గాయమై తీవ్ర రక్తస్రావం అయ్యింది. దీంతో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుంటే మార్గమధ్యలో మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.


అమ్మకానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

నేటి నుంచి షా-అలీ-పహిల్వాన్ ఉర్సు


షా-అలీ-పహిల్వాన్ దర్గా ముఖద్వారం


సర్ ముబారక్ దర్గా


దడ్ ముబారక్ దర్గా

● రాత్రికి షా అలీ దర్గాలో గంధోత్సవం
● 31న సర్ ముబార్ దర్గాలో చిన్న కిస్తీ
● జూన్ 1న దడ్ ముబారక్ దర్గాలో పెద్ద కిస్తీ
● జూన్ 2న ముగియనున్న ఉర్సు

అలంపూర్: పట్టణంలో షా-అలీ-పహిల్వాన్ ఉర్సు గురువారం నుంచి జూన్ రెండో తేదీ వరకు కొనసాగనుంది. కులమతాలకు అతీతంగా జరిగే ఉర్సుకు షా-అలీ-పహిల్వాన్, సర్ ముబారక్, దడ్ ముబారక్ దర్గాలు ముస్తాబయ్యాయి. దర్గా చైర్మన్ సయ్యద్ షా అహ్మద్ ఉవైసీ ఖాద్రి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. ఉర్సుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానుండటంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. ఆర్డీఓ రామచందర్ అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు.

కార్యక్రమాలు ఇలా..

గురువారం రాత్రి గంధోత్సవం ఉంటుంది. సయ్యద్ ఖాదర్‌వలీ సాహెబ్ ఇంటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి గంధం తీసుకెళ్తారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం సర్ ముబారక్ దర్గాకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ సమర్పించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. చివరగా దడ్ ముబారక్ దర్గాకు గంధాన్ని తీసుకెళ్లి ప్రార్థనలు చేయడం ఆనవాయితీ.

■ 31వ తేదీన సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీ.. జూన్ 1న దడ్ ముబారక్ దర్గా వద్ద పెద్ద కిస్తీ నిర్వహిస్తారు. పెద్ద కిస్తీ పోటీలను తిలకించడానికి భక్తులు భారీగా తరలివస్తారు. జూన్ 2న మహిళల ప్రత్యేక ఉర్సుతో ఉత్సవాలు ముగియనున్నాయి.

గంధోత్సవంతో ప్రారంభం..

షా-అలీ-పహిల్వాన్ ఉర్సు గంధోత్సవంతో ప్రారంభిస్తారు. కర్ణాటకలోని గుల్బర్గా ఖాజా బందె నవాజ్ దర్గాలో ఉర్సు ముగిసిన అనంతరం అక్కడి నుంచి గంధం తీసుకురావడం ఆనవాయితీ. గంధాన్ని నేరుగా సయ్యద్ ఖాదర్ బాషా ఇంటికి తీసుకురావడంతో ఉర్సు ప్రారంభమవుతుంది. ఉర్సుకు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, కర్ణాటకలోని రాయచూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం చూపుతున్న సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ సాంఘిక గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కొత్తగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ ఉపాధ్యాయ, అధ్యాపక పేరుతో సంఘాన్ని స్థాపించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు హైదరాబాద్‌లో టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ కార్యదర్శి సీతాలక్ష్మిని కలిసి వారి సమస్యలు వివరించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, గురుకులాల్లో ఉపాధ్యాయులకు నైట్ స్టే బాధ్యతలను తొలగించాలని, కేర్‌టేకర్‌లను నియమించాలని, పీహెచ్‌డీ అర్హత ఉన్న వారికి, ప్రిన్సిపాల్స్‌కి అదనపు ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పార్ట్ టైం ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆవుల సైదులు, కార్యదర్శి పోలు జోసెఫ్, కవిత, తాడూరి అరుణ్‌కుమార్, ఆవ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బెంగ తీర్చిన ‘బేలర్’

● హార్వెస్టర్‌తో కోతలు సులభం
● పశుగ్రాసం సేకరణ
● సమయం ఆదా


వరి పంట కోస్తున్న హార్వెస్టర్

గండేడ్: సాగంటేనే సవాలక్ష సమస్యలు. అందులో ప్రధానమైంది కూలీల కొరత. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది రైతులకు భారంగా పరిణమించింది. దీన్ని అధిగమించడానికి రైతులు యంత్రాల వినియోగంపై దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా కోత, కలుపు యంత్రాలతో పాటు పశుగ్రాసాన్ని కూడ వేసుకునేందుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. దీంతో తక్కువ ఖర్చు, సమయంలోనే పనులు పూర్తి చేసుకుంటున్నారు.

హార్వెస్టర్లతోనే కోతలు...

గ్రామాలలో రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తుంటారు. పంటను కోయడానికి రైతులు ఎక్కువగా హార్వెస్టర్లు వినియోగిస్తున్నారు. యంత్రాల రాక ముందు కరిగెట మొదలుకొని నాటు వేయడం కలుపు తీయడం, మందులు చల్లడం, కోతలు కోయడం, ధాన్యం వేరు చేయడం, పశుగ్రాసాన్ని కూడ గట్టడం అన్ని కూలీలతోనే చేయించుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వస్తున్న యాంత్రీకరణతో రైతులకు శ్రమ, సమయాభావాన్ని తగ్గిస్తున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో వీటి వినియోగం విరివిగా పెరిగిపోయింది. ఒక్క ఎకరా కోయడానికి సుమారు 12 మంది కూలీలు కావాలి. ఒక్కరోజు కోస్తే మరో రోజు దగ్గరికి వేయాలి. మరుసటి పశువులతో బంతులు తొక్కించాలి. ఇలా తక్కువలో తక్కువ మూడు రోజులు పడుతుంది. అదే హార్వెస్టర్ అయితే ఒకే గంటలో ఎకరా భూమి కోస్తుంది. ధాన్యం కూడా వెంటనే వస్తుంది. పైగా దీనికి కూలీల కంటే తక్కువ ఖర్చు అవుతుంది. సుమారు రూ.3వేల నుండి రూ.3,500 వరకు ఖర్చవుతుంది.

బేలర్‌తో పశుగ్రాసం కట్టలు సులువు

ప్రస్తుత పరిస్థితుల్లో పశువులకు పశుగ్రాసం ఎంతగానో అవసరం. పంట కోసిన తర్వాత పశుగ్రాసాన్ని కూడబెటేందుకు చాలా సమయం పట్టేది. దానిని కుప్పలు కుప్పలుగా వేసి ఆరబెట్టి తర్వాత వాముగా వేసేవారు. ఇటీవల పశుగ్రాసాన్ని చుట్ట చుట్టే యంత్రం బేలర్ రావడంతో రైతుల బెంగ తీరింది. హార్వెస్టర్లు కోసిన గడ్డిని బేలర్ సునాయాసంగా కట్టలు కడుతుంది. ఈ యంత్రాలు మార్కెట్‌లో అందుబాటులోకి రావడంతో కట్టకు రూ.35 చొప్పునా ఒక్క రోజులో పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని బేలర్ కట్టలు కడుతుంది. ప్రస్తుతం గండేడ్ మండలంలోని గ్రామాల్లో రౌండ్‌గా చుట్టే దానినే వాడుతున్నారు. ఇలా కట్టిన పశుగ్రాసం కట్టలను ఒక్కోసారిగా ట్రాక్టర్‌లో సుమారుగా ఐదెకరాల పశుగ్రాసాన్ని తరలించేందుకు వీలుగా ఉంటుంది. ఈ యంత్రం ద్వారా చుట్టిన గడ్డి కట్టలను కూడా తక్కువ స్థలంలో ఎక్కువగా నిల్వ చేసుకునేందుకు వీలుగా ఉండడంతో పాటు వర్షానికి తడిసి పశుగ్రాసం పాడవ్వకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం ఉంది.

కూలీల బాధ తప్పింది..



ఐదు ఎకరాల్లో వరి వేశాను. నాటు సమయంలో 60 మంది కూలీలకు గాను రూ.60 వేలు ఖర్చయ్యింది. మూడు రోజుల పట్టింది. కూలీల కోసం ఇబ్బందులు పడ్డాం. దీన్ని కోయడానికి గాను సుమారు ఆరున్నర గంటల సమయం పట్టింది. ఇందుకు గాను దాదాపు రూ.20వేలు మాత్రమే ఖర్చయ్యింది. ఎండల కారణంగా వరి పంట కోయడానికి కూలీలు ఎవరు రావడం లేదు.

– రాజేందర్, రైతు, సల్కర్‌పేట్

గడ్డిని సులభంగా దగ్గర వేసుకుంటున్నాం..



ఈ రోజుల్లో పశుగ్రాసం డిమాండ్ బాగా పెరిగింది. పంట కోసిన తర్వాత పశుగ్రాసం దగ్గరగా వేసుకోడానికి ఈ బేలర్ ఎంతో మేలుగా ఉంది. ఒక్క గడ్డి కట్ట కట్టడానికి రూ.35 తీసుకుంటున్నారు. గతంతో గడ్డి కోసి కుప్పలు వేయడంతో పోలిస్తే బేలర్ వాడకంతో ఖర్చు బాగా తగ్గింది. దీనిగాను పశువులకు పశుగ్రాసం సైతం కొరత ఏర్పడకుండా, వర్షానికి నానాకుండా పెట్టుకోగలుగుతున్నాం.

– నీలి వెంకటయ్య, రైతు, కష్లాపూర్


గడ్డి కట్టలు కడుతున్న బేలర్


బేలర్‌తో కట్టిన గడ్డి కట్టలు

మార్కెట్‌కు ఉల్లి దిగుమతి

దేవరకద్ర: పట్టణంలో మార్కెట్‌కు బుధవారం పలువురు వ్యాపారులు ఇతర మార్కెట్‌ల నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుని విక్రయాలు సాగించారు. దిగుబడులు తగ్గిపోయిన కారణంగా రైతులు చాలా తక్కువ మొత్తంలో ఉల్లిని అమ్మకానికి తెస్తున్నారు. దీనివల్ల మార్కెట్‌లో కొరత ఏర్పడింది. కొనుగోలు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు ముందుగానే ఇతర మార్కెట్‌లకు వెళ్లి ఉల్లిని కొనుగోలు చేసి దేవరకద్ర మార్కెట్‌కు తరలించి విక్రయాలు సాగిస్తున్నారు. దీనివల్ల మార్కెట్‌లో వేలం లేకుండానే ఉల్లి అమ్మకాలు సాగాయి. కొందరు రైతులు ఉల్లిని తెచ్చిన బయట ట్రాక్టర్లలో పెట్టుకుని అమ్మకాలు సాగించారు. మార్కెట్‌లో 45 కేజీల ఉల్లి బస్తా ధర కనిష్ఠంగా రూ.1,100, గరిష్ఠంగా రూ.1,300 విక్రయించారు. మధ్యస్తంగా రూ.1,200 అమ్మకాలు సాగాయి.

మళ్లీ చిరుత ప్రత్యక్షం

● భయంతో ఇళ్లకు పరుగెత్తిన రైతులు

గండేడ్: కుక్కను తరుముతూ మరోమారు చిరుత ప్రత్యక్షమైంది. అదిచూసి భయంతో రైతులు ఇళ్లకు వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే కొండాపూర్ చెందిన రెడ్డిపల్లి ఆంజనేయులు, గోవు రాములు, రెడ్డిపల్లి కృష్ణయ్య రాత్రి పొలం వద్దకు నిద్రించడానికి వెళ్లారు. వీరి పొలాలు బొందెగుట్ట, గొర్లెల్లగుట్ట మధ్య ఉన్నాయి. అక్కడే పశువుల పాకలు ఏర్పాటు చేసుకొని వాటిని అక్కడే కట్టిసుకుంటున్నారు. రాత్రి వచ్చి అక్కడే పడుకొని పాలు పిండుకుని ఇళ్లకు వెళ్తారు. ఎప్పటి లాగే మంగళవారం రాత్రి ఎవరి పొలం వద్దకు వారు వెళ్లారు. రెడ్డిపల్లి ఆంజనేయులు రాత్రి 10గంటల సమయంలో గుడిసె వద్ద మంట పెట్టి పశువులకు మేత వేయడానికి వెళ్లాడు. అదే సమయంలో తన కుక్క అరుస్తూ వస్తుండగా కంటపడింది. దీంతో గట్టిగా చప్పుడు చేస్తూ లైట్ వేసాడు. కొద్ది దూరంలో చిరుత నిలబడి కనిపించింది. దీంతో ఆయన భయంతో పక్కనే ఉన్న కృష్ణయ్య, రాములు వద్దకు వెళ్లాడు. జరిగిన విషయాన్ని వారికి చెప్పడంతో వారు అంజిలయ్య పాక వద్దకు చేరుకున్నారు. వాళ్లు వచ్చే సరికి చిరుత కనిపించలేదు. అక్కడ ఉండకుండా ఇళ్లకు చేరుకున్నారు.

కుక్కల దాడిలో జింకపిల్ల మృతి


పోలీస్‌స్టేషన్ వద్ద జింక పిల్లకు చికిత్స చేస్తున్న వైద్యుడు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ శివారులో కుక్కల దాడిలో గాయపడిన జింక పిల్లకు చికిత్స చేసిన తర్వాత కొద్దిసేపటికే మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారి సమీపంలోని హోటల్ వెనుక ఉన్న వ్యవసాయ పొలాల్లో జింక పిల్లను మూడు కుక్కలు వెంటపడి దాడి చేసి తీవ్రంగా కరిచాయి. గమనించిన ఓ రైతు గ్రామస్తులకు చెప్పడంతో కొందరు పరుగున వెళ్లి కుక్కలను తరిమి పోలీసులకు సమాచారం చేరవేశారు. వెంటనే అక్కడికి వెళ్లిన ఎస్ఐ శ్రీనివాస్ జింక పిల్లను స్టేషన్ వద్దకు తెచ్చి నీళ్లను తాగించారు. పశు వైద్యుడిని పిలిపించి గాయాలైన చోట కుట్లు వేయించారు. చికిత్స చేయించిన తర్వాత కొద్దిసేపటికే జింక పిల్ల మృతి చెందినట్లు డాక్టర్ రాజేష్‌ఖన్న తెలిపారు. తర్వాత పోస్టుమార్టం నిర్వహించి అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు.

మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి

ఊట్కూరు: మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. రుద్రనగర్‌కు చెందిన వెంకట్‌రెడ్డి కొన్నేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం గడిపేవాడు. ఏడాదిగా మతిస్థిమితం కోల్పోయి వీధిలో తిరుగుతున్నాడు. రాత్రి సమయంలో రాళ్లు, కర్రలతో వీధికి చెందిన పలువురిపై దాడి చేశాడు. దీంతో కొందరికి గాయాలు కాగా చాలామంది భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు గుమిగూడి ఆ వ్యక్తిని తాడుతో స్తంభానికి కట్టేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి యువకుడిని వదిలేశారు.

అచ్చంపేట సివిల్ సప్లయ్ గోదాం సీజ్

● 81 క్వింటాళ్ల బియ్యం అవకతవకలైనట్లు గుర్తించిన టాస్క్‌ఫోర్సు


గోదాంను సీజ్ చేస్తున్న అధికారులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంపై బుధవారం సాయంత్రం ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్సు టీం దాడులు నిర్వహించారు. రికార్డులు, స్టాకు పరిశీలించారు. పరిశీలనలో 81 (163 బస్తాలు) క్వింటాళ్ల బియ్యం అవకతకలైనట్లు అధికారులు గుర్తించారు. గోదాంను సీజ్ చేశారు. గోదాం ఇన్‌చార్జి వెంకటేష్‌ను వివరాలు అడగగా, పొంతన లేని సమాధానం చెప్పారని టాస్క్‌ఫోర్స్ టీం ఓఎస్డీ, అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు తెలిపారు. ప్రజాపంపిణీ బియ్యం పక్కదారి పడుతుందని ఫిర్యాదులు అందడంతో ఆకస్మిక తనిఖీ నిర్వహించామన్నారు. పరిశీలనలో పలు విషయాలు తమ దృష్టికి వచ్చాయని, గోదాం ఇన్‌చార్జి, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులకు నివేదికలు అందించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది ప్రభాకర్, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, డీఎం బాల్‌రాజు, డీటీ రవి పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు


చిన్నోనిపల్లె నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రాంచందర్

గట్టు: చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గద్వాల ఆర్డీఓ రాంచందర్ తెలిపారు. బుధవారం చిన్నోనిపల్లె ముంపు గ్రామాన్ని ఆయనతోపాటు నెట్టెంపాడు ఈఈ రహీముద్దీన్, జేఈ ఉపేందర్, తహసీల్దార్ సరితారాణి సందర్శించారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్ గండిని పూడ్చి వేసిన నేపథ్యంలో వాగుల్లోని నీరు రిజర్వాయర్‌లోకి నీరు వచ్చిన చేరిన తరుణంలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ చిన్నోనిపల్లె గ్రామాన్ని సందర్శించి, సమస్యలపై ఆరా తీశారు. సగం వరకు పూడ్చిన గండి కారణంగా చిన్నోనిపల్లె గ్రామం రెండు వైపులా ఉన్న వాగుల్లోని నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతుందని, వర్షాకాలంలో వర్షాలకు రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరిగి నివాస గృహాల వరకు వచ్చే ప్రమాదం ఉందని ముంపు గ్రామస్తులు వాపోయారు. కాల్వను ఏర్పాటు చేసి రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. ఇండ్లకు నష్ట పరిహారం పూర్తి స్థాయిలో ఇవ్వని కారణంగా పునరావాసంలో కొత్త ఇండ్ల నిర్మాణం ఇబ్బందిగా మారిందని, మల్లన్నసాగర్ మాదిరిగా చిన్నోనిపల్లె నిర్వాసితులకు ప్రభుత్వ పరిహారం చెల్లించాలని, పునరావాస కేంద్రంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ప్రభుత్వ పరంగా అందించే అన్ని రకాల లబ్ధిని చేకూర్చే విధంగా తన వంతు కృషి చేయనున్నట్లు ఆర్డీఓ హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్వాసితులకు న్యాయం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీటీ రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవారత్న పురస్కారాన్ని అందుకున్న శాంతారెడ్డి


పురస్కారాన్ని అందుకుంటున్న శాంతారెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి, తెలుగు భాషోపాధ్యాయురాలు జి.శాంతారెడ్డి సాహితీరంగం, విద్యారంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుకుగా రాష్ట్రస్థాయి సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. స్వర్ణభారతి కళానిలయం వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సంస్థ అధ్యక్షుడు నారోజు మోహన్ తదితర ప్రముఖలచే పురస్కారాన్ని అందుకున్నారు.

దాతలూ.. ఆదుకోరూ



ఈయన పేరు ఆంజనేయులు. ఉండవెల్లి మండలం తక్కశీల గ్రామం. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. బైక్ పైనుంచి కిందపడటంతో నడుం కింద నుంచి కాళ్ల వరకు స్పర్శ కోల్పోయి ఐదేళ్లుగా మంచానికే పరిమితమయ్యారు. కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ ఫలితం లేదు. రోజు పడుకొని ఉండటంతో వీపు భాగంలో తీవ్ర గాయమైంది. దీంతో భార్య లలిత ఇళ్లల్లో పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.. వీరికి 5, 10, 12 ఏళ్ల వయసున్న పిల్లలున్నారు. కనీసం దివ్యాంగ పింఛన్ కూడా రావడం లేదు. దాతలు ఆర్థిక చేయూతనందించి ఆదుకోవాలని.. వివరాల కోసం సెల్‌ఫోన్ నంబర్ 79938 65214 సంప్రదించాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

– ఉండవెల్లి

సీడ్స్ దుకాణం యజమాని అదృశ్యం

భూత్పూర్: పట్టణంలోని విజయ్‌శ్రీ అగ్రో సీడ్స్ యజమాని ఎండీ.ఫారూఖ్ అదృశ్యమైనట్లు అతడి తమ్ముడు ఇలియాస్ బుధవారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని న్యూప్రేమ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఫారుఖ్ కొన్నేళ్లుగా పట్టణంలో సీడ్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం దుకాణానికి వెళ్తున్నాని చెప్పి.. రాత్రి వరకు ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో బుధవారం దుకాణం వద్దకు కుటుంబసభ్యులు రాగా మూసి ఉంది. పట్టణంలోని ఇతర వ్యక్తుల సీడ్స్ దుకాణంలో ఆరా తీయగా కన్పించడం లేదని తెలిసింది. కాగా సీడ్స్ విషయంలో రాయచూర్‌కు చెందిన ఇంజప్ప, దేవప్ప, సురేష్, రాయప్ప వేధింపులకు గురిచేస్తుండే వారని, వారిపై అనుమానం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సైబర్ మోసం.. రూ.5.50లక్షలు మాయం

అమరచింత: బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమవడంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈర్లదిన్నెకి చెందిన రాజశేఖర్ గ్రామంలో ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం యూనియన్ బ్యాంకు నుంచి ఖాతాకు సంబందించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని వచ్చిన లింక్‌తో వాటిని డౌన్‌లోడ్ చేసుకుంటుండగా ఖాతాలోని రూ.5.50లక్షలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు బ్యాంకు అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుంది. బుధవారం 1,012అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 27 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.